మొగుడిలాంటి నల్లదొరల రాజ్యం వొచ్చిందిగాని దేసెం బాగుపడిందా? ఆయన మాత్రం సర్వనాశనమై పోయాడు.

ఆయన పెద్దకొడుకు – ఆయబ్బాయి సన్నగా, పీలగా ఉండేవోడు. సెమ్కీ కోటేసుకుని, సెమ్కీ టోపీ ఎట్టుకుని, రోజూ గుర్రబ్బండి మీద స్కూలుకి ఒస్తుండేవోడు. ఆయబ్బాయిగారితోపాటే నన్నూ స్కూల్లో చేర్పించారు పంతులుగారు. స్కూలు మొత్తానికి నేనొక్కణ్ణే హరిజనుణ్ణి. కుర్రోళ్ళంతా 'అసింటా... అసింటా...' అని నన్ను దూరంగా వుంచితే, కృష్ణమాచారి మాష్టారు – ఆయన మంచోడే కాని పెళ్ళావంటే సచ్చే బయం, స్కూలునుంచి వచ్చాకా స్నానం చేసి ఆ బట్టలు తడిపితే గాని ఇంట్లోకి రానిచ్చేది కాదు – ఈడి పక్కన ఎవరు కూచుంటారంటే ఒక్కడూ రాలేదు. అప్పుడీయబ్బాయి సిగ్గుపడుతూ లేచొచ్చి నా పక్కన కూచున్నాడు. ఆయబ్బాయి స్పోటకం వొచ్చి పదిహేనేళ్ళప్పుడే పోయాడు.

రెండో కుర్రాడు చాకులాంటాడు. క్లాసులో ఫస్టు వస్తుండేవోడు. 'బావా! ఈణ్ణి బాగా సదివించు. ఈడు ఐసీయస్ కలెక్టరవుతాడు' అని పోరేవోడు ఆయన బామ్మర్ది. అల్లాంటోణ్ణి ఇంగ్లీషు సదువులొద్దని, స్కూలు మాన్పించి, జాతీయ విద్యని తెలుగు, హిందీ నేర్పించాడు. సివరికి ఆ కుర్రాడు ఎందుకూ పనికి రాకుండా పోయి ఓ రోజు ఇంట్లోంచి పారిపోయాడు. ఏవైపోయాడో ఎవరికీ తెలవదు.

తవరు తప్పు పట్టకుండా వుంటే ఓ మాటంటాను. నెహ్రూ గారు గాంధీగారి కుడి బుజం గదా. మరి ఆయన ఇందిరమ్మని ఇంగ్లీషు సదువులు సదవొద్దన్నాడా? అహింస, అహింసంటూ ఆయనఎనకాల ఈయనా గొంతు సించుకుని అరిచేవోడు గదా? ఆయన ప్రదాన మంత్రయ్యాక పోలీసులు, తుపాకులు వొద్దన్నాడా? అసలు తుపాకీ పేలకుండా సొతంత్రం వచ్చిన తర్వాత ఎప్పుడైనా తెల్లారిందా? మరింక అహింసేంటి, జాతీయ విద్యేంటి, జనాలని ఎర్రోళ్ళని సెయ్యడానికి కాకపోతే. నెహ్రూ గారిలా లౌక్యం తెలీక గుడ్డిగా గాందీగార్ని నమ్మిన పంతులుగారి లాంటోళ్ళు నాశనవైపోయారంటే నాశనవైపోరా?

పోయినోళ్ళు పోగా సివరికి లచ్చుమ్మగారని ఆరమ్మాయి మిగిలింది. ఆవిడగారి ఆకరి కొడుకు – అంటే గాందీ పంతులుగారి మనవడు – ఇప్పుడొచ్చిన ఈ కుర్రాడు.

లచ్చుమ్మగారు వయసులో వుండగా కుందనపు బొమ్మలా వుండేది. సాక్షాత్తూ లచ్మీదేవిలా ఒంటినిండా నగలతో కలకలలాడుతూ ఉండేది. మహారాణీలా మసిలింది. సివరి రోజుల్లో మహా దరిద్రం అనుబవించింది. వానలో, సలిలో, పాక అరుగుమీద, గోనె పట్టా మీద వణుకుతూ పడుకునుండేది. సివరికి సస్తే మోసేవోళ్ళు లేరు.

